సాక్షి కరీంనగర్

శనివారం ¦ 18 ¦ మార్చి ¦ 2023



భక్తుల పుణ్యస్నానాలు

ధర్మపురి: ధర్మపురిలోని గోదావరినదిలో శుక్రవారం భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. గంగమ్మ, గౌరమ్మకు మొక్కులు చెల్లించి నైవేద్యాలు సమర్పించారు.



రాజన్నా దీవించు

వేములవాడ: వేములవాడ రాజన్నను శుక్రవారం 10 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. తలనీలాలు, నిలువెత్తు బంగారం, కోడె మొక్కులు చెల్లించుకున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
27.0/18.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి వేళ ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

రూ.116 చెల్లిస్తే ఇంటికే సీతారాముల కల్యాణ తలంబ్రాలు



కరీంనగర్: భద్రాద్రి రాముల వారి కల్యాణ తలంబ్రాలను భక్తుల ఇంటికి చేరవేసే కార్యక్రమాన్ని టీఎస్‌ఆర్టీసీ చేపట్టిందని, రూ.116 చెల్లించి బుక్ చేసుకుంటే భద్రాద్రిలో రామకల్యాణం పూర్తయిన వెంటనే తలంబ్రాలను టీఎస్‌ఆర్టీసీ కార్గో ద్వారా మీ ఇంటికి చేరుస్తారని జిల్లా కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ ఆర్వీ.కర్ణన్, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ తలంబ్రాలను రూ.116 చెల్లించి బుక్ చేసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ భద్రాచలం వెళ్లి సీతారాముల కల్యాణం చూడలేనివారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. బుకింగ్‌కు అన్వేశ్ 9154298561, బుకింగ్ కౌంటర్ 9154298562లో సంప్రదించాలన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 98 మంది పట్టివేత

- కమిషనరేట్ వ్యాప్తంగా 237 వాహనాలు సీజ్
- సీపీ పర్యవేక్షణలో తనిఖీలు



కరీంనగర్‌క్రైం: కరీంనగర్ పోలీసుకమిషరేట్ వ్యాప్తంగా పోలీసులు గురువారం రాత్రి 9 గంటల నుంచి అర్ధరాత్రి వరకు వాహనాలు తనిఖీ చేశారు. పోలీసులు బృందాలుగా ఏర్పడి మద్యంతాగి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను సీజ్‌చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన 98 మందిని పట్టుకోగా 237 వాహనాలను ఆయా పోలీసుస్టేషన్లకు తరలించారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన ఆరుగురు మైనర్లను పట్టుకున్నారు. సీపీ సుబ్బారాయుడు కరీంనగర్‌తో పాటు జమ్మికుంట, హుజూరాబాద్, కేశవపట్నం, మానకొండూరులో తనిఖీలను పర్యవేక్షించారు. మద్యంతాగి వాహనాలు నడిపిన వారిని బ్రీత్ అనలైజర్లతో పరీక్షించారు. రోడ్డు నిబంధనలు పాటించని వారిని అదుపులోకి తీసుకుని నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ తనిఖీల్లో అడిషనల్ డీసీపీలు ఎస్.శ్రీనివాస్, జి.చంద్రమోహన్, ఏసీపీలు తుల శ్రీనివాసరావు, కరుణాకర్‌రావు, వెంకటరెడ్డి, కె.శ్రీనివాస్, మదన్‌లాల్, సి.ప్రతాప్, కమీషనరేట్‌లోని సీఐలు, ఆర్‌ఐలు, ఎస్సైలు, పోలీసులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 490 మంది గైర్హాజరు

కరీంనగర్: ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శుక్రవారం జిల్లావ్యాప్తంగా ప్రశాంతంగా జరిగాయని డీఐఈవో రాజ్యలక్ష్మి వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా జనరల్ విభాగంలో 14,517 మందికి గాను 280 మంది విద్యార్థులు గైర్హాజరు కాగా 14,237 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1838 మందికి గాను 210 మంది గైర్హాజరు కాగా 1628 మంది హాజరయ్యారు. జనరల్, ఒకేషనల్ విభాగాలను కలుపుకుని జిల్లావ్యాప్తంగా 16,355 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 490 మంది గైర్హాజరు కాగా 15,865 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని డీఐఈవో వెల్లడించారు.

రండి బాబూ.. రండి!

- అగ్గువ ధరకే ఎంసీకే డీజిల్
- మార్కెట్లో రూ.100, ఎంసీకే సిబ్బంది వద్ద రూ.80
- యూపీఐ, క్రెడిట్ కార్డులు తీసుకోరు, నగదే కావాలట
- నీటిట్యాంకర్ల నుంచి తీసి విక్రయిస్తున్న సిబ్బంది
- హైలెవల్, లోలెవల్ రిజర్వాయర్ల డీజిల్‌లో భారీ వ్యత్యాసం
- ఓ సీనియర్ ఉద్యోగి కనుసన్నల్లో వ్యవహారం?



ట్యాంకర్ల నుంచి డీజిల్ తీస్తున్న బల్దియా సిబ్బంది



స.హ చట్టం ద్వారా పొందిన సమాచారం



సమావేశంలో మాట్లాడుతున్న ఆమిర్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్‌లో మీకు అగ్గువ ధరకే డీజిల్ కావాలా? ఒకేరోజు 100 లేదా 200 లీటర్లు అవసరమా? మరేం ఫర్లేదు. మీకు అత్యంత చవకగా.. లీటరు కేవలం రూ.80కే లభిస్తుంది. అదేంటీ.. ఢిల్లీ, ఇతర కేంద్ర పాలిత ప్రాంతాల్లోనూ ఇంత చవక ధరలకు డీజిల్ రాదు కదా? అనుకుంటున్నారు కదా? వాస్తవమే. కానీ, మన కరీంనగర్‌లో దొరుకుతుంది. అదెలా సాధ్యం? ఇక్కడ సెంట్రల్ డ్యూటీ, స్టేట్ డ్యూటీ, ఇతర ట్యాక్స్‌లు ఏమీ ఉండవా? అనేదేనే మీ ప్రశ్నా. అవ్వే అన్నీ ఉంటాయి. అన్నీ ఉంటే.. రూ.80కి లీటరు డీజిల్ ఎలా వస్తుంది? అనుకుంటున్నారా? ఇంకెలా వస్తుంది. ముందుగా బల్దియా వాహనాల్లో నింపుకున్న డీజిల్‌ను రాత్రిపూట గుట్టుచప్పుడు కాకుండా తీయడం, తమకు తెలిసిన ట్రావెల్స్, ప్రైవేటు వ్యక్తులకు లీటరుకు కేవలం రూ.80కే విక్రయించడం వల్ల వస్తుంది. ఇదీ.. ఇంత తక్కువ ధరకు కరీంనగర్‌లో డీజిల్ లభించడం వెనక ఉన్న రహస్యం.

ఆరోపణ ఏంటి?

బల్దియాలో వాహనాల డీజిల్ వినియోగంలో అక్రమాలు జరుగుతున్నాయని రోజూ రాత్రిపూట డీజిల్ అమ్ముకుంటున్నారని చాలాకాలంగా ప్రచారం జరుగుతోంది. దీనిపై సామాజిక ఉద్యమకారుడు ఆమీర్ బల్దియాలో వాహనాల డీజిల్ ఖర్చుల వివరాలను సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించాడు. ఈ లెక్కల్లో వ్యత్యాసాలపై బల్దియా అధికారులు చెప్పాలంటూ శుక్రవారం ప్రెస్‌మీట్‌లో నిలదీశాడు. కరీంనగర్‌లో 60 డివిజన్లకు హైలెవల్ రిజర్వాయర్ (కోర్టు ట్యాంకర్), లో లెవల్ రిజర్వాయర్ (మార్కెట్ ట్యాంక్) ద్వారా నీటిసరఫరా జరుగుతుంది. హైలెవల్‌లో నాలుగు వాటర్ ట్యాంకర్లు ఒక జనరేటర్ ఉండగా, లో లెవల్‌లో 3 వాటర్ ట్యాంకర్లు, ఒక జేసీబీ, ఒక జనరేటర్, ఒక బ్లేడు బండి ఉన్నాయి. హై లెవల్ రిజర్వాయర్ పరిధిలో ప్రతీ నెలా ట్యాంకర్ల ద్వారా జరిగే నీటి సరఫరాకు డీజిల్ ఖర్చు రూ.లక్ష నుంచి లక్షన్నరకు ఖర్చవుతుండగా, లో లెవల్‌లో నెల ఖర్చు మాత్రం రూ.ఐదు లక్షల నుంచి దాదాపు రూ.ఆరు లక్షల వరకు అవుతోంది.

ఏం జరుగుతోంది?

లో లెవల్ రిజర్వాయర్ ట్యాంకర్లు ఒక్కొక్క దాన్నుంచి ప్రతీరోజూ రాత్రిపూట 40 లీటర్ల వరకు డీజిల్ క్యాన్లలో నింపుకుని రహస్యంగా తరలిస్తున్నారు. ఇలా రోజు దాదాపు 100 నుంచి 200 లీటర్ల వరకు డీజిల్‌ను తరలించి బ్లాక్‌మార్కెట్‌లో రూ.80చొప్పున రోజుకు ఇరవై వేల విలువైన డీజిల్‌ను దాదాపు రూ.16వేలకే విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో ఎలాంటి యూపీఐలు, క్రెడిట్ కార్డులు అంగీకరించడం లేదు. మొత్తం నగదులోనే లావాదేవీలు చేస్తున్నారు. నగరంలోని పలు ప్రైవేటు ట్రావెల్స్ వాహనాలకు ఈ డీజిల్ వెళ్తుందని సమాచారం. ఇంత జరుగుతుంటే ఈ వ్యవహారం కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఆడిట్‌లో గుర్తించకపోవడం చాలా విడ్డూరంగా ఉందని పలువురు వాపోతున్నారు. బల్దియా ఉన్నతాధికారులు, కొందరు స్థానిక ప్రజాప్రతినిధులు కలిసే ఈ దందా చేస్తున్నారన్న ఆరోపణలు పెరిగిపోతున్నాయి.

'మసి'పూయడంలో ఆ అధికారి దిట్ట

ఈ మొత్తం వ్యవహారంలో కింగ్‌పిన్ ఓ బల్దియా అధికారి. ఇదే నగరానికి చెందిన ఓ సీనియర్ ఉద్యోగి ఇక్కడ లాంగ్‌స్టాండింగ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఏ పనికి సంబంధించిన అంచనాలనైనా (టెండర్లను తారుమారు చేసి) అమాంతంగా పెంచేయడం, ఉన్నతాధికారులకు చేతులు తడపడంలో అతనిది అందె వేసిన చేయి. తన దారికి అడ్డు వస్తే ఉన్నతాధికారినైనా బెదిరిస్తాడు. తనకు పదే పదే అడ్డు తగులుతున్నాడని ఓ ఉన్నతాధికారిని గతేడాది బల్దియాలోనే ఏసీబీకి పట్టించడంలో ఇతనే ప్రధాన సూత్రధారి అన్న ఆరోపణలు ఉన్నాయి. ఆ పరిణామం తరువాత మిగిలిన అధికారులు సైతం ఇతనికి బెదిరిపోతున్నారు.

'మేరా రేషన్'.. సమస్యలకు సొల్యూషన్



రేషన్ దుకాణం



మేరా రేషన్ యాప్

- యాప్‌లో దుకాణం, సరకుల వివరాలు
- లబ్ధిదారులు ఫిర్యాదు చేసేందుకు అవకాశం

జిల్లాలో మొత్తం గ్రామాలు:	313
మున్సిపాలిటీలు:	4 (చొప్పదండి, కొత్తపల్లి, హుజూరాబాద్, జమ్మికుంట)
కార్పొరేషన్:	1(కరీంనగర్)
మొత్తం రేషన్ దుకాణాలు:	487
కార్డుదారులు:	2,76,120
ప్రతీనెలా పంపిణీ చేసే బియ్యం:	6402 మెట్రిక్ టన్నులు

కరీంనగర్ అర్బన్: రేషన్ పంపిణీలో మరింత పారదర్శకత చాటిస్తూ కేంద్రం నూతన విధానానికి తెరదీసింది. ప్రతి ఇంటా ఇంటర్నెట్ వేళ్లానుకోగా అరచేతిలోనే సమస్త సమాచారాన్ని అందించేందుకు మేరా రేషన్ యాప్‌ను రూపొందించింది. రేషన్ సరకులు పక్కదారి పట్టకుండా ఇప్పటికే పలు చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం ఇటీవల ఓటీపీ లేదా ఐరిస్ విధానం అమలు చేస్తోంది. తాజాగా మరింత పారదర్శకత సాధించేందుకు మేరా రేషన్ యాప్‌ను కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది.

వన్ నేషన్.. వన్ రేషన్

జిల్లాలో 2.76లక్షల కార్డుదారులకు గానూ 487 మంది రేషన్ డీలర్లున్నారు. వీరంతా ప్రతినెలా గడువులోగా డీడీలు చెల్లిస్తేనే సరుకులు ప్రజా పంపిణీ దుకాణాలకు చేరుతాయి. అనంతరం వాటిని కార్డుదారులకు సకాలంలో పంపిణీ చేయడం పరిపాటి. ప్రస్తుతం ఓటీపీ, ఐరిస్ విధానం అమలులో ఉండటతో లబ్ధిదారులు స్వయంగా వస్తేనే బియ్యం తీసుకునేందుకు వీలుంటుంది. మేరా రేషన్ యాప్ ద్వారా లబ్ధిదారులు తమ ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే సౌకర్యం కల్పించింది.

యాప్‌లో ఏమేం ఉంటాయంటే

సమీపంలోని రేషన్ దుకాణం, అందుబాటులో ఉన్న సరకుల గురించి తెలుసుకోవచ్చు. కొత్త ప్రదేశానికి వలస వెళ్లేవారికి ఇది ఎంతో ఉపయోగపడుతుంది. రేషన్ దుకాణం చిరునామా కోసం ఇతరులను అడగాల్సిన అవసరం ఉండదు. రేషన్ కార్డు ద్వారా ఇటీవల జరిపిన లావాదేవీలు వివరాలు తెలుస్తాయి. గడిచిన ఆరు నెలల్లో ఏ సరుకులు తీసుకున్నారో యాప్‌లో ఉంటాయి. ఒకవేళ లబ్ధిదారు సరుకులు తీసుకోకపోయినా తీసుకున్నట్లు చూపితే ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఉంటుంది. రేషన్ కార్డుకు ఆధార్ అనుసంధానమైందీ లేనిదీ తెలుసుకోవచ్చు. ఒకవేళ అనుసంధానం కాకపోతే వెంటనే చేసుకునేందుకు వీలుంటుంది. ప్రస్తుతం విధానంలో ఆధార్ అనుసంధానమైతేనే మొబైల్‌కు ఓటీపీ నంబర్ వస్తుంది. ఏదైనా రేషన్ దుకాణంలో డీలర్ సమయపాలన పాటించకపోయినా, అక్రమాలకు పాల్పడుతున్నా యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. సలహాలు, సూచనలు ఇచ్చేందుకు వీలుంది. ప్రస్తుతం హిందీ, ఇంగ్లిష్ భాషల్లో యాప్ అందుబాటులో ఉండగా త్వరలోనే తెలుగులోనూ రానుంది.

యాప్ డౌన్‌లోడ్ ఇలా

ప్లేస్టోర్‌లోకి వెళ్లి మేరా రేషన్ యాప్ అని టైపు చేయాలి. ఆ తర్వాత యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్నాక ఆప్షన్లను ఎంపిక చేసుకుని సేవల్ని పొందవచ్చు.

బహుళ ప్రయోజనం

యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులున్న ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లొచ్చు. రేషన్ సరుకులు తీసుకున్నది లేనిదీ, గత వివరాలను పొందవచ్చు.

– కమలేశ్, పౌరసరఫరాల ఇన్‌స్పెక్టర్

బాగుంది



మేరా రేషన్ యాప్‌తో రేషన్‌కు సంబంధించిన అన్ని రకాల వివరాలను పొందవచ్చు. ఫిర్యాదు చేసేందుకు అవకాశముండగా, ఆధార్ అనుసంధానం చేసుకోవచ్చు.

– అభిషేక్, లబ్ధిదారు, కరీంనగర్

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ సస్పెన్షన్

- లైంగిక వేధింపులను తీవ్రంగా పరిగణించిన కలెక్టర్
- వెంటనే సస్పెండ్ చేయాలని డీఈవోకు కలెక్టర్ ఆదేశాలు
- విచారణ పూర్తయ్యేవరకు జగిత్యాలలోనే ఉండాలని స్పష్టీకరణ
- ఫిర్యాదు చేస్తే కేసు నమోదుకు సిద్ధం: ఎస్పీ భాస్కర్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని ఇటిక్యాల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం శ్రీనివాస్ సస్పెండ్ అయ్యాడు. తోటి మహిళా టీచర్లను లైంగికంగా వేధిస్తున్న వీడియోలు వెలుగుచూడటంపై కలెక్టర్ యాస్మిన్ బాషా సీరియస్ అయ్యారు. అతనిపై వచ్చిన ఆరోపణలన్నీ వాస్తవమని తేలడంతో అతన్ని సస్పెండ్ చేస్తామని గురువారం రాత్రి 'సాక్షి'కి తెలిపారు. వెంటనే రాత్రికి రాత్రి ప్రిన్సిపాల్, పీజీటీ ఎం.శ్రీనివాస్‌ను సబ్‌రూల్ వన్ ఆఫ్ ఎయిట్ ఆఫ్ తెలంగాణ సివిల్ సర్వీసెస్ రూల్ (సీసీఏ) 1991 ప్రకారం.. వెంటనే సస్పెండ్ చేయాలంటూ జిల్లా విద్యాధికారికి (డీఈవో)కు అధికారికంగా ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలు తక్షణమే అమలులోకి వస్తాయని, ఈ వ్యవహారంలో మరింత లోతుగా దర్యాప్తు జరపాలని డీఈవోకు సూచించారు. ఈ ఆదేశాలు శుక్రవారం మీడియాకు విడుదల చేశారు. విచారణ జరుగుతున్నంత కాలం శ్రీనివాస్ అందుబాటులోనే ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనే సమాచారం ఇవ్వకుండా జగిత్యాల జిల్లా కేంద్రం వీడి వెళ్లకూడదని స్పష్టంచేశారు. ఈ ఉత్తర్వుల కాపీలను హైదరాబాద్‌లోని మోడల్ స్కూల్స్ అడిషనల్ డైరెక్టర్‌కు, అడిషనల్ కలెక్టర్ (లోకల్‌బాడీస్)కు సైతం పంపారు.

కలెక్టర్ యాస్మిన్‌పై ప్రశంసలు

ఇటిక్యాల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాస్ లైంగిక వేధింపులను సాక్షి దినపత్రిక 'టీచకుడు' అన్న పేరుతో వెలుగులోకి తీసుకువచ్చింది. అతను స్టాఫ్‌రూంలో మహిళలను అసభ్యకరంగా తాకుతూ, లైంగికంగా వేధిస్తున్నప్పుడు తీసిన వీడియోలు, ఫొటోలను 'సాక్షి' కలెక్టర్ కార్యాలయానికి పంపింది. దీనిని తీవ్రంగా పరిగనించిన కలెక్టర్ బాధితులను రక్షించేందుకు రంగంలోకి దిగారు. వెంటనే కీచక గురువును రాత్రికి రాత్రే సస్పెండ్ చేశారు. దీంతో కలెక్టర్ యాస్మిన్ బాషాపై ప్రశంసల వర్షం కురుస్తోంది. తమను ఆదుకున్న కలెక్టర్‌కు బాధితులు, మహిళా సిబ్బంది, విద్యార్థులు అంతా మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా ప్రజలు, నెటిజన్లు సైతం సైతం కలెక్టర్ యాస్మిన్ భాషాను అభినందిస్తున్నారు. అదే సమయంలో అతనిపై ఫిర్యాదు చేస్తే కేసునమోదు చేసేందుకు జిల్లా పోలీసులు సిద్ధంగా ఉన్నారని ఎస్పీ భాస్కర్ హామీ ఇచ్చారు.

సందేహాలు నివృత్తి చేసుకుంటూ ముందుకెళ్లాలి



కరీంనగర్‌క్రైం: సందేహాలను నివృత్తిచేసుకుని, పోలీసులు ప్రజలకు సేవలందించేందుకు ముందుకెళ్లాలని అడిషనల్ డీసీపీ జి.చంద్రమోహన్ తెలిపారు. సీపీ కార్యాలయంలో వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న అడ్మిన్ (పరిపాలన) అధికారుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పోలీస్‌స్టేషన్లలో వివిధ విభాగాల పనితీరును ఎప్పటికప్పుడూ సమీక్షించాలన్నారు. ఫిర్యాదులపై సత్వరం స్పందించి పరిష్కార మార్గాలు అన్వేషించడంలో పరిపాలన అధికారుల పాత్ర కీలకమన్నారు. వివిధ సమస్యలతో స్టేషన్‌కు వచ్చే ప్రజలతో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, అధికారులు అందుబాటులో లేరనే సమాధానాలు ఇచ్చి తిప్పిపంపడం వంటి చర్యలకు పాల్పడితే విధుల్లో ఉండే అధికారులపై శాఖాపరంగా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏసీపీ కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

48 ప్లాట్లు.. రూ.14.54కోట్లు

- తొలిరోజు అంగారిక టౌన్‌షిప్ ప్లాట్ల వేలం
- నేడు, రేపూ కొనసాగింపు..



వేలం పాడుతున్న అధికారులు

కరీంనగర్ అర్బన్: అంగారిక టౌన్‌షిప్ ప్లాట్ల వేలానికి గిరాకీ ఏర్పడింది. తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్‌లో ప్రభుత్వ భూమిని అంగారిక టౌన్‌షిప్ పేరుతో ప్లాట్లను విక్రయిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికి రెండు విడతలుగా ప్రత్యక్ష వేలం నిర్వహించగా మూడో విడత ప్రత్యక్ష వేలంను శుక్రవారం ప్రారంభించారు. ఈ నెల 19వరకు ప్లాట్ల వేలం నిర్వహించనుండగా జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్ ప్రత్యేకంగా పరిశీలిస్తున్నారు. జిల్లా అదనపు కలెక్టర్లు జీవీ శ్యాంప్రసాద్‌లాల్, గరిమా అగర్వాల్‌లు అక్కడే ఉండి వేలం పాటను పర్యవేక్షిస్తున్నారు. నగరంలోని వాసర గార్డెన్‌లో శుక్రవారం 48 ప్లాట్లను వేలం వేశారు. 157 ప్లాట్లకు గానూ 50 ప్లాట్లకు ప్రత్యక్ష వేలం వేసి 48ప్లాట్స్ అమ్మడం జరిగిందని, వేలంలో రూ.14.54 కోట్ల ఆదాయం వచ్చిందని కలెక్టర్ వివరించారు. కాగా చదరపు గజానికి అత్యధికంగా రూ.15వేలు, అతి తక్కువగా రూ.6000 పలికింది. మిగతా ప్లాట్లకు ఈ నెల 19వరకు వేలం నిర్వహించనున్నారు. ఓల్డ్ రాజీవ్ స్వగృహ దరఖాస్తుదారులు వేలం పాటలో పాల్గొనాలంటే ఒరిజినల్ ఈ–సేవ రసీదు తీసుకురావాలని, అలాగే కొత్త డీడీలు కూడా తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఆర్డీవో ఆనంద్ కుమార్, తహసీల్దార్లు నల్ల వెంకట్‌రెడ్డి, కోడం కనకయ్య, రాజీవ్ స్వగృహ ఏఈ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

లక్షలు వెచ్చించినా దక్కని ప్రాణం

- పదిహేను రోజుల క్రితం చిన్నారికి కుక్కకాటు
- ఇన్‌ఫెక్షన్ సోకడంతో పలు ఆస్పత్రుల్లో వైద్యం
- చికిత్స పొందుతూ హైదరాబాద్ గాంధీలో మృతి
- వైద్యానికి రూ.10లక్షల వరకు అప్పు
- అయినా దక్కని ప్రాణం.. పోచంపల్లిలో విషాదం



మహేశ్వరి(ఫైల్)

మానకొండూర్: అభం శుభం తెలియని చిన్నారి అందరాని లోకాలకు వెళ్లింది. తమ్ముళ్లను ఆడిపిస్తూ.. అల్లరిచేస్తూ.. ఇంటికి మహాలక్ష్మిగా భావించిన కూతురు ఇకలేదన్న నిజాన్ని ఆ తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. పదిహేను రోజుల క్రితం కుక్కకాటుకు గురైన బాలిక చికిత్స పొందుతూ శుక్రవారం చనిపోయింది. ఈ ఘటన మానకొండూర్ మండలం పోచంపల్లి గ్రామంలో విషాదం నింపింది. స్థానికుల వివరాల ప్రకారం.. పోచంపల్లి గ్రామానికి చెందిన కోమళ్ల చిరంజీవి– రజిత దంపతులు వ్యవసాయం, కూలీ పని చేస్తుంటారు. వీరికి కూతురు మహేశ్వరి(12), ఇద్దరు కొడుకులు సంతానం. మహేశ్వరి స్థానిక మోడల్ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతోంది. పదిహేను రోజుల క్రితం తమ్ముళ్లతో ఇంటిముందు ఆడుకుంటుండగా ఓ కుక్క అకస్మాత్తుగా వచ్చి మహేశ్వరి చేతును కరిచింది. వెంటనే తల్లిదండ్రులు మండలంలోని వెల్ది ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు ఇంజక్షన్‌తో పాటు వారంరోజుల పాటు వైద్యం చేశారు. వారం తరువాత మహేశ్వరికి జ్వరం వచ్చింది. వెంటనే కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చిన్నారికి ఇన్‌ఫెక్షన్ సోకిందని చెప్పడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించారు. మహేశ్వరి ప్రాణాలు దక్కించుకోవడానికి తల్లిదండ్రులు రూ.10లక్షలకు పైగా అప్పు చేశారు. అయినా పరిస్థితిలో మార్పురాకపోవడం, విషమంగా మారడంతో గాంధీ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మహేశ్వరి ప్రాణాలు వదిలింది. చిన్నారి మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది.



గన్నేరువరంలో ట్రాక్టర్లపై పడిన చెట్టు



మాదాపూర్‌లో నేలవాలిన మొక్కజొన్న

వర్షం.. పంటలకు నష్టం

గన్నేరువరం/జమ్మికుంట/శంకరపట్నం/ఇల్లందకుంట: జిల్లావ్యాప్తంగా గురువారం రాత్రి కురిసిన గాలివానతో పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. గన్నేరువరంలో కాంతాల కిషన్ రెడ్డి, కాంతాల నాగమణి కొండల్‌రెడ్డికి చెందిన ట్రాక్టర్లపై చెట్లు విరిగిపడడంతో ఇంజన్లు ధ్వంసం అయ్యాయి. వివిధ గ్రామాల్లో మొక్కజొన్న, మామిడి తోటలకు నష్టం ఏర్పడింది. మండలవ్యాప్తంగా 60ఎకరాలు మొక్కజొన్న నేలవాలిందని మండల వ్యవసాయాధికారి కిరణ్మయి తెలిపారు. జమ్మికుంట మండలంలోని 9 రెవెన్యూ గ్రామాల్లో 326 మంది రైతులకు చెందిన 696 ఎకరాల మొక్కజొన్న పంట నేలకొరిగింది. వ్యవసాయ అధికారులు పంట వివరాలు సేకరించారు. శంకరపట్నం మండలం కేశవపట్నం, కన్నాపూర్, రాజాపూర్ గ్రామాల్లో మామిడి తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇల్లందకుంట మండలంలో దెబ్బతిన్న పంటను శుక్రవారం ఏడీఏ సునీత, మండల వ్యవసాయ అధికారి గుర్రం రజిత పరిశీలించారు. 1,215 ఎకరాల్లో పంట పాక్షికంగా దెబ్బతిన్నదని నిర్ధారించడం జరిగిందని వివరించారు.



మాదాపూర్‌లో నేలరాలిన మామిడికాయలు

క్లుప్తంగా

పేద కుటుంబానికి ఆర్థిక సాయం



కరీంనగర్: బ్రాహ్మణ సేవా వాహిని(బీఎస్‌వీ) ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్ పట్టణానికి చెందిన పేద బ్రాహ్మణుడు సంతోష్ కుటుంబానికి రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా వాహిని రాష్ట్ర అధ్యక్షుడు రఘుకిరణాచార్యులు మాట్లాడుతూ.. బ్రాహ్మణ సేవా వాహిని సంస్థ గత కొన్నేళ్లుగా పేదవారికి అండగా ఉంటోందన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులు భాస్కర వజ్ఝల, వెంకటేశ్వర శర్మ, వట్టికోట హరిప్రసాద్ ఆచార్యులు, నంద కిశోర్, జిల్లా అధ్యక్షుడు మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి జైలు

కరీంనగర్‌క్రైం: రోడ్డుపై ఒంటరిగా వెళ్తున్న అమ్మాయి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన నేరంలో నిందితులిద్దరికీ జైలు శిక్ష , జరిమానా విధిస్తూ కరీంనగర్ మొదటి అదనపు జిల్లా జడ్జి (ఇన్‌చార్జ్ పోక్సో కోర్టు) ఎస్.శ్రీవాణి శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కరీంనగర్ విద్యానగర్‌లో నివసిస్తున్న ఓ మైనర్‌ను 2018లో వేధించిన కేసులో విద్యానగర్ చెందిన కాశీద్ సూర్యకాంత్ (22), దేవల్ల రసూల్ (19)పై కరీంనగర్ టూటౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేశారు. ఈ కేసులో సాక్షులను ఏపీపీ సంజీవరెడ్డి విచారించగా సాక్ష్యాధారాలు పరిశీలించిన జడ్జి నిందితులిద్దరికీ మూడేళ్ల జైలుశిక్ష, రూ.4వేల చొప్పున జరిమానా విధించారు.

రేకుర్తిలో ఒకరి ఆత్మహత్య

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రేకుర్తిలో శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన ఎలగందుల నవీన్‌కుమార్ (32) శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై బి.ఎల్లయ్యగౌడ్ తెలిపారు. ఎస్సై తెలిపిన ప్రాథమిక సమాచారం మేరకు.. హైదరాబాద్ నుంచి 15 రోజుల క్రితం రేకుర్తికి వచ్చి నవీన్ అద్దెఇంట్లో ఉంటూ.. బార్బర్ షాపు ఏర్పాటుచేసేందుకు సన్నాహాలు చేస్తున్నాడు. ఈ క్రమంలో మల్యాలలో జరిగిన శుభకార్యానికి వెళ్లి వచ్చిన నవీన్ అద్దె ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు అందలేదని మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించామని ఎస్సై పేర్కొన్నారు.

విద్యుత్ చౌర్యం కేసులో ఒకరికి శిక్ష

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లి మండలకేంద్రానికి చెందిన శివరాత్రి శ్రీనుకు విద్యుత్ చౌర్యం కేసులో జైలుశిక్ష పడినట్లు విద్యుత్‌శాఖ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.స్వామి తెలిపారు. సీఐ కథనం ప్రకారం... 2019లో విద్యుత్ చౌర్యం చేస్తూ పట్టుబడగా మొదటి తప్పుగా నిందితుడికి రూ.500 జరిమానా విధించి వదిలేశామన్నారు. అయినప్పటికీ విద్యుత్ చౌర్యం చేస్తూ రెండోసారి విద్యుత్‌శాఖ అధికారులకు పట్టుబడగా కేసు నమోదుచేసి నిందితుడిని కోర్టులో హాజరుపర్చామన్నారు. కేసును పరిశీలించిన జడ్జి శ్రీవాణి శుక్రవారం రూ.7,014 చెల్లించాలని లేదంటే రెండు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పు వెల్లడించినట్లు తెలిపారు. ఎస్సైలు ఏ.నిరంజన్‌రెడ్డి, కానిస్టేబుల్లు రమేశ్, రాజయ్య పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మున్సిపల్ పరిధిలో డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ ఇళ్లు కేటాయించాలని బీజేపీ నాయకుడు గొట్టిముక్కల సురేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

కమీషన్ ఏజెంట్లపై నజర్

- ఇక ఆన్‌లైన్‌లోనే అనుమతి
- ఆన్‌లైన్‌లోకి మార్కెట్ కార్యకలాపాలు



వ్యవసాయ మార్కెట్ కార్యాలయం

కరీంనగర్‌అర్బన్: మార్కెట్లను రైతులకు ప్రయోజనార్థకంగా మలిచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. పారదర్శకంగా సేవలందడంతో ప్రభుత్వానికి ఆదాయంతో పాటు రైతులకు సత్వర సేవలందేలా దిద్దుబాటు చర్యలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో నిర్వహించే పంటల క్రయవిక్రయాల్లో కీలకమైన ట్రేడర్స్ (కొనుగోలుదారులు) కమీషన్ ఏజెంట్లపై నిఘాపెంచడం, ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం దారి మళ్లించకుండా ఆన్‌లైన్ వ్యవస్థను ప్రవేశపెట్టాలని మార్కెటింగ్ శాఖ నిర్ణయించింది.

ఆన్‌లైన్ అనుమతికి ప్రతిపాదన...

జిల్లాలోని మొత్తం 92 మంది ట్రేడర్లుండగా మరో 125 మంది కమీషన్ ఏజెంట్ల పర్యవేక్షణలో కొనుగోళ్ల ప్రక్రియ సాగుతోంది. వ్యవసాయ మార్కెట్ యార్డులోనే క్రయవిక్రయాలు జరపాలనేది నిబంధన. ఈ క్రమంలో ట్రేడర్స్ క్రయవిక్రయాలపై మార్కెటింగ్ శాఖకు 1 శాతం చెల్లించాల్సి ఉంటుంది. అదే సమయంలో ట్రేడర్లకు రైతులకు మధ్య అనుసంధానంగా వ్యవహరించే కమీషన్ ఏజెంట్లకు రైతులు రూ.1.25 (రూ. వందకు రూ.1.25) చెల్లించాల్సి వస్తోంది. ట్రేడర్స్, మార్కెట్ కమిటీలతో సంబంధం లేకుండా బహిరంగ మార్కెట్లో క్రయవిక్రయాలు నిర్వహించడంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం రాకుండా పోతుండటంతో ఆన్‌లైన్ అనుమతి ఇవ్వాలనే ప్రతిపాదనను ప్రభుత్వం తెరపైకి తెచ్చింది.

మార్కెటింగ్ శాఖ కసరత్తు...

ప్రతీ ట్రేడరుకు ఓ క్యూఆర్ కోడ్ కేటాయించే పద్ధతి అందుబాటులోకి వస్తే దేశవ్యాప్తంగా ఎక్కడి నుంచైనా క్రయవిక్రయాలు చేసినా సంబంధిత మార్కెట్‌యార్డులకు నిబంధనల ప్రకారం కమీషన్ చేరుతుందనేది ప్రభుత్వ ఆలోచన. దీంతో క్రయవిక్రయాల వ్యవహారమంతా జీరోలో కాకుండా పారదర్శకంగా జరిగే అవకాశం ఉంది. ఈ నెలాఖరులోగా ఈ ప్రక్రియను కొలిక్కి తెచ్చేలా మార్కెటింగ్ శాఖ కసరత్తు చేస్తోంది.

కమీషన్ ఏజెంట్ల పాత్ర..

వాస్తవంగా కమీషన్ ఏజెంట్లకు వ్యవసాయ మార్కెట్ యార్డులకు ఎలాంటి సంబంధం ఉండదు. రైతులు పండించే పంట ఉత్పత్తులను కమీషన్ ఏజెంట్ల ప్రమేయం లేకుండా నేరుగా ట్రేడర్స్‌కు విక్రయించుకునే వెసులుబాటు ఉంది. కానీ జిల్లాలో పెట్టుబడి కోసం రైతులు దళారీ వ్యవస్థపై ఆధారపడే పరిస్థితులుండడంతో కమీషన్ ఏజెంట్ల పాత్ర ఎక్కువైంది. రైతుల దగ్గర రూ.100కు రూ.1.25 చొప్పున కమీషన్ తీసుకునే ఏజెంట్లు వాటిని యార్డులకు చెల్లించరు. దీంతో ప్రభుత్వానికి రైతులకు నష్టం చేకూరుతోంది. మార్కెటింగ్ శాఖతో పరోక్ష సంబంధం ఉన్న కమీషన్ ఏజెంట్లు సైతం ఆన్‌లైన్‌లో అనుమతి తీసుకునేలా చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటోంది.

వడ్డీ వ్యాపారమే కీలకం

జిల్లాలో 125 మంది కమీషన్ ఏజెంట్లు ఉన్నట్లు అనధికారిక సమాచారం. వడ్డీ వ్యాపారమే వీరి ప్రధాన ఆదాయం. పంటకాలంలో రూ.100 రూ.25 చొప్పున వడ్డీ తీసుకునే అనధికార ఒప్పందం సాగుతోంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. పంట చేతికందిన తర్వాత లాభనష్టాలను సరిచూసుకుంటే మిగిలేదేమీ ఉండడం లేదు. ఈ క్రమంలో కమీషన్ ఏజెంట్లను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రభుత్వం తీసుకొచ్చే ఆన్‌లైన్ అనుమతి ప్రక్రియ అంతా పారదర్శకంగా అమలైతే అసలైన కమీషన్ ఏజెంట్లు ఎంతమంది అనేది తేలే అవకాశం ఉంది.

సీపీఆర్‌తో ఆకస్మిక మరణాల నిర్మూలన

- కరీంనగర్ సీపీ ఎల్.సుబ్బారాయుడు



మాట్లాడుతున్న సీపీ సుబ్బారాయుడు

కరీంనగర్‌క్రైం: సీపీఆర్‌తో ఆకస్మిక మరణాలను నిర్మూలించవచ్చని, గుండెపోట్ల నుంచి ప్రజల ప్రాణాలు కాపాడవచ్చని ఇందుకు పోలీసులు శిక్షణ ఇప్పిస్తున్నామని కరీంనగర్ సీపీ సుబ్బరాయుడు అన్నారు. కరీంనగర్ సీపీ కార్యాలయంలో శుక్రవారం కరీంనగర్‌రూరల్ డివిజన్, సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ (సీఏఆర్), క్యూఆర్టీ విభాగాలకు చెందిన పోలీసులకు సీపీఆర్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. నిత్యం ప్రజల మధ్య ఉండే పోలీసులకు ఆకస్మిక గుండెపోట్లు సంభవించిన వ్యక్తులు తారసపడే అవకాశం ఉన్నందున శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల ప్రాణాలు రక్షించేందుకు పోలీసులు అందుబాటులో ఉంటారన్నారు. దీంతో పోలీస్ శాఖ ప్రతిష్ట పెరగడంతో పాటు పోలీసులకు గుర్తింపు ఉంటుందని వారికి శాఖాపరంగా రివార్డులు, అవార్డులు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా వైద్యులు కిరణ్, ప్రణవ్ సీపీఆర్ విధానంపై పోలీసులకు ప్రయోగాత్మకంగా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు ఎస్. శ్రీనివాస్, జి.చంద్రమోహన్, ఏసీపీ సి.ప్రతాప్, ఆర్ఐలు సురేశ్, మురళీ, శేఖర్‌బాబు, యూనిట్ ఆసుపత్రి అసిస్టెంట్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

మిల్లర్ ట్రాక్టర్ బోల్తా.. మహిళ దుర్మరణం



రేణుక మృతదేహం



రేణుక (ఫైల్)

తిమ్మాపూర్: మిల్లర్ ట్రాక్టర్ బోల్తాపడి మహిళ దుర్మరణం పాలైన ఘటన మండలంలోని పొలంపల్లి శివారులో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. పొలంపల్లికి చెందిన ఉప్పారపు రేణుక(40) మిల్లర్ ట్రాక్టర్‌పై స్లాబ్‌లు వేసేందుకు కూలీపనులు వెళ్తోంది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 6.30 గంటలకు 12 మందితో కలిసి నాగసముద్రాలు గ్రామంలో స్లాబ్‌వేసేందుకు మిల్లర్‌యంత్రంతో వెళ్లారు. నల్లగొండ పొలంపల్లి మధ్య కోళ్ల ఫాం వద్దకు చేరుకునేసరికి ఎదురుగా లారీరావడంతో దానిని తప్పించేక్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి పక్కనున్న పొలంలోకి ట్రాక్టర్ దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ఘటనలో రేణుకకు తీవ్రగాయలై అక్కడికక్కడే మృతిచెందింది. 11 మంది స్వల్పగాయాలతో బయటపడ్డారు. రేణుకకు భర్త రాజయ్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు.

సైడ్‌బర్మ్ లేకనే ప్రమాదం..

నల్లగొండ నుంచి పొలంపల్లికి ఏడాది క్రితం రోడ్డు ప్యాచ్ వర్క్‌చేశారు. అయితే కాంట్రాక్టర్ రోడ్డుకు ఇరువైపులా మట్టి పోయలేదు. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించడం ఇబ్బందిగా మారుతోంది. సైడ్‌బర్మ్ ఏర్పాటుచేయాలని కాంట్రాక్టర్‌కు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఇప్పటికే పలుమార్లు ప్రమాదాలు జరిగాయి. ప్రమాదానికి కారణమైన కాంట్రాక్టర్ రేణుక కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం చెల్లించాలని స్థానికులు డిమాండ్ చేశారు.

కడుపునొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య

రామగిరి(మంథని): ముత్తారం మండలం లక్కారం గ్రామానికి చెందిన పంజాల శ్యామల(40) వివాహిత కడుపు నొప్పి భరించలేక క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. ముత్తారం ఎస్సై రాములు కథనం ప్రకారం.. గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారాముల ఆలయం ప్రతిష్ఠాపనోత్సవాలకు కొడుకు శ్రీకాంత్‌తో గురువారం సాయంత్రం కలిసి వెళ్లి ఇంటికి తిరిగి వచ్చింది. ఈక్రమంలో శ్యామలకు విపరీతంగా కడుపు లేవడంతో శ్రీకాంత్ స్థానిక ఆర్ఎంపీ వైద్యుడిని తీసుకువచ్చేలోపు క్రిమిసంహారక మందుతాగి అపస్మారక స్థితికి చేరడంతో గమనించిన శ్రీకాంత్ తన స్నేహితుడి సాయంతో పెద్దపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అందించారు. వైద్యుల సూచనతో కరీంనగర్‌లోని ప్రైవేట్‌ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందింది. మృతురాలి కుమారుడు శ్రీకాంత్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నదిలో దూకేందుకు యత్నం..

- కాపాడిన రివర్ పోలీసులు

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోదావరి బ్రిడ్జి పైనుంచి శుక్రవారం నదిలోకి దూకేందుకు యత్నించిన ఓ వ్యక్తిని రివర్ పోలీసులు కాపాడారు. టూటౌన్ పోలీసులు, రివర్ పోలీసులు కథనం ప్రకారం.. యైటింక్లయిన్‌కాలనీకి చెందిన ఓ వ్యక్తి కుటుంబ సమస్యలతో కొంతకాలంగా మానసికవేదనకు గురవుతున్నాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది తన వాట్సప్‌లో మెడలో దండవేసుకుని ఫొటోపై ఓం శాంతి అని రాసుకుని గోదావరినది వద్దకు వచ్చి దూకేక్రమంలో అక్కడే విధులు నిర్వహిస్తున్న రివర్ పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. అనంతరం కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. అన్ని సమస్యలకు ఆత్మహత్యలు పరిష్కారం కాదని టూటౌన్ సీఐ వేణుగోపాల్ సూచించారు. సదరు వ్యక్తిని కాపాడిన రివర్ పోలీసులను సీఐ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్రగాయాలు

రామగుండం: రాజీవ్‌రహదారిపై కుందనపల్లి సమీపంలోని భారత్ పెట్రోల్ పంపు వద్ద శుక్రవారం ఎదురెదురుగా కారు–లారీ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. అంతర్గాత ఎస్సై బోగె సంతోశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన రావుల రఘు–సరోజన దంపతులు బెల్లంపల్లిలో ఓ వివాహానికి హాజరయ్యేందుకు కారులో వెళ్తున్నారు. ఈ క్రమంలో కారు అదుపుతప్పి మధ్యలోని డివైడర్‌ను ఢీకొట్టి కరీంనగర్‌వైపు కర్ర లోడుతో వెళ్తున్న లారీని ఢీకొంది. కారులో ఉన్న వారికి తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



అరుణ్ మృతదేహం

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామగుండం బీ పవర్‌హౌస్ రాజీవ్ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దెదావత్ అరుణ్(22) మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ న్యూపీకే రామయ్యకాలనికి చెందిన దెదావత్ అరుణ్ తన సోదరుడిని రామగుండం రైల్వే స్టేషన్ నుంచి తీసుకురావడానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. కల్వర్టు వద్ద వాహనంపై నుంచి పడి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. ఘటనా స్థలంతో పాటు ఆస్పత్రిలోని తరుణ మృతదేహాన్ని పోలీసులు పరిశీలించి ప్రమాద వివరాలపై విచారణ చేస్తున్నారు.

గుండె పోటుతో ప్రముఖ వ్యాపారి..

ఎన్టీపీసీ రామగుండం ప్రాంతానికి చెందిన బాలాజీ హార్డ్‌వేర్ యజమాని నారాయణదాస్ గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడు. నారాయణదాస్ మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

పలువురు ఎస్సైల బదిలీ

కరీంనగర్‌క్రైం: రాజన్న జోన్ పరిధిలో పలువురు ఎస్సైలు బదిలీ అయ్యారు. రాజన్న సిరిసిల్లలోని బోయినపల్లి ఎస్సై పి.అభిలాష్‌ను గంగాధరకు, గంగాధర ఎస్సై రాజును డీఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. టాస్క్‌ఫోర్స్ ఎస్సై వంశీకృష్ణను త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు, ఎస్.రాజేశ్‌ను కామారెడ్డి గాంధారీ పోలీస్‌స్టేషన్ నుంచి చిగురుమామిడి ఎస్సైగా బదిలీ చేశారు. చిగురుమామిడి ఎస్సై డి.సుధాకర్‌ను డీఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. కె.రాజేశ్‌ను ఇల్లంతకుంట ఎస్సైగా, ఇల్లంతకుంట ఎస్సైగా ఉన్న మహేందర్‌ను డీఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు.

రూ.3 కోట్లకు మహిళ టోకరా!

కరీంనగర్‌క్రైం: నగరంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంపూర్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ పలువురి వద్ద నుంచి రూ.3 కోట్లు వసూలు చేసి, టోకరా వేసినట్లు తెలిసింది. టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆమెను శుక్రవారం అదుపులోకి తీసుకొని, విచారణ జరిపినట్లు సమాచారం. సదరు మహిళ అధిక వడ్డీ చెల్లిస్తానని నమ్మబలికి, తమ వద్ద డబ్బులు తీసుకొని, మోసం చేసిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి వుషు పోటీల్లో జిల్లాకు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న నాయకులు



విద్యార్థులను అభినందిస్తున్న అనంతరెడ్డి

కరీంనగర్‌స్పోర్ట్స్: నిజామాబాద్‌లోని నాగారంలో ఈనెల 15న నిర్వహించిన రాష్ట్రస్థాయి వుషు పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు అద్వితీయ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించినట్లు వుషు సంఘం ఉమ్మడి జిల్లా కార్యదర్శి విద్యాసాగర్ తెలిపారు. సీనియర్స్ మహిళల విభాగంలో అఖిల రజత పతకం, శ్రావణి కాంస్య పతకం సాధించగా సబ్ జూనియర్ విభాగంలో అంజన కార్తీక కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధానకార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డితో పాటు ఫండస్ స్కూల్ డైరెక్టర్ గోపు సుశాంక్‌రెడ్డి, కోచ్‌లు కోడూరి శేఖర్, శ్రీనివాస్ అభినందించారు.

మానేరు విద్యార్థుల ప్రతిభ..

మానేరు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ఇటీవల ఇస్కాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒలింపియాడ్‌లో అద్వితీయ ప్రతిభ కనబరిచినట్లు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి తెలిపారు. పాఠశాల చెందిన సుమారు 30 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా ఎనిమిది మంది సర్టిఫికెట్లు సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులు సామిక్, సిరిహాసిని, శివ చైతన్య, మని సాయిచరణ్, విగ్నేష్, శ్రీరామ్, సుస్వరను విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతరెడ్డితో పాటు ఏఓ, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ఎమ్మెల్సీపై కక్షసాధింపు చర్యలు మానుకోవాలి

- దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్న బీజేపీ
- బీజేపీలో చేరితే దాడులు ఉండవా
- ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కరీంనగర్: తొమ్మిదేళ్లపాలనలో బీజేపీ అభివృద్ధిచేసిందేమి లేదని జాతీయ దర్యాప్తు సంస్థల అధికారాలను దుర్వినియోగం చేస్తున్నారని, ప్రతిపక్ష పార్టీల నాయకులను బీజేపీలో చేరాలని ఒత్తిడి చేస్తున్నారని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ధ్వజమెత్తారు. శుక్రవారం కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎమ్మెల్సీ కవితపై లిక్కర్ కేసు పేరిట ఒత్తిళ్లకు పాల్పడడం, విచారణల పేరిట వేధింపులకు గురి చేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర అభివృద్ధిని జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని, సీఎం కేసీఆర్‌ను దెబ్బతీసేందుకు కుట్ర పన్నుతున్నారని, ఈడీ, ఐటీ, సీబీఐ దాడుల పేరిట బీఆర్ఎస్ నేతల ఇళ్లపై బీజేపీ దాడులను ప్రోత్సహించడం అప్రజాస్వామికమన్నారు. బీజేపీ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు మానుకోని ఎమ్మెల్సీ కవితపై అనుసరిస్తున్న వైఖరిని మార్చుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ.రామకృష్ణారావు, గ్రంథాలయ చైర్మన్ అనిల్‌కుమార్, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ముదిగంటి సురేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు వీర్ల వెంకటేశ్వరరావు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మండల అధ్యక్షుడు మేచినేని నవీన్‌రావ్, మార్కెట్‌కమిటీ చైర్మన్లు, సింగిల్‌విండో చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

దళితబంధుతో ఆర్థికాభివృద్ధి సాధించారు

- నాడు కూలీలు, నేడు యజమానులు
- కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్వీ కర్ణన్

కరీంనగర్: దళితుల సామాజిక, ఆర్థికాభివృద్ధికి దళితబంధు ఉపకరిస్తుందని కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ అన్నారు. సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీ బృందం సభ్యులు శుక్రవారం కలెక్టర్ ఆఫీస్‌లో కలెక్టర్‌ను కలిసి మాట్లాడారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన దళితబంధు పథకంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బృందానికి కలెక్టర్ వివరించారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో 18,021 మంది లబ్ధిదారులకు వివిధ రకాల యూనిట్లు నెలకొల్పామని ఇందుకు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో రూ.9.90 లక్షలు, రూ.10వేల దళిత రక్షణ నిధి కింద జమచేశామన్నారు. ఈ నిధులతో లబ్ధిదారులు వివిధ రకాల యూనిట్లు హార్వెస్టర్లు, ట్రక్స్, ట్రాక్టర్లు, డీసీఎం వ్యాన్, పొక్లెయిన్, మినీ గూడ్స్ వెహికిల్స్, కార్లు, మెడికల్‌షాప్, ఫర్టిలైజర్ షాప్, సూపర్‌మార్కెట్, డెయిరీ, పేపర్ ప్లేట్ మ్యానుఫ్యాక్చరింగ్, ఐరన్ బెడ్స్ మ్యాను ఫ్యాక్చరింగ్ యూనిట్లు నెలకొల్పి వ్యాపారవేత్తలుగా రాణిస్తున్నారన్నారు. ఒకప్పుడు కూలీలుగా, డ్రైవర్లుగా పనిచేసిన వారు నేడు యజమానులయ్యారన్నారు. సమావేశంలో బృందం డైరెక్టర్ రేవతి, అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, ట్రైనీ కలెక్టర్ లెనిన్ వాత్సల్ టోప్పో, సెస్ అధికారులు ప్రదీప్‌కాంబ్లే, డాక్టర్ వెంకట్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై శిక్షణ ఇవ్వాలి

కరీంనగర్‌టౌన్: గుండెపోటుకు గురైన వారిని కాపాడేందుకు సీపీఆర్ విధానంలో జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో గర్భిణుల నమోదు, సాధారణ ప్రసవాలు, సీజనల్ వ్యాధులు, ‘కంటివెలుగు’ శిబిరాల నిర్వహణ, ఇతర ఆరోగ్య కార్యక్రమాల అమలుపై జిల్లాశాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో గుండెపోటుకు గురైన వారికి తక్షణ సాయం అందించేందుకు ఇప్పటికే 1000 మందికి శిక్షణ అందించామని, ఇతరశాఖలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, జిల్లా వైద్యాధికారి జువేరియా, స్త్రీ శిశు సంక్షేమ అధికారి సబితాకుమారి, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ రత్నమాల, ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

శుభకార్యానికి వెళ్తూ...తిరిగిరాని లోకాలకు

- రోడ్డు ప్రమాదంలో భార్య మృతి.. భర్త ,మరొకరికి గాయాలు
- ఆర్టీసీ బస్సు, లారీ డ్రైవర్ల అజాగ్రత్తే కారణం



సౌజన్య (ఫైల్)



ప్రమాద స్థలంలో సౌజన్య, మధూకర్

మంథని: ఓ శుభకార్యానికి వెళ్తున్న భార్యభర్తలను ప్రమాద రూపంలో భార్యను మృత్యువు కబలించగా భర్త తీవ్రంగా గాయపడ్డాడు. వీరితో పాటు వచ్చిన సమీప బంధువైన బాలుడికి సైతం తీవ్ర గాయాలైన ఘటన శుక్రవారం మంథని మండలం భట్టుపల్లి బస్టాప్ వద్ద చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. మంథని మండలం ఖానాపూర్‌కు చెందిన రాపాక మధూకర్ తన భార్య సౌజన్య(28) అన్న కుమారుడు యశ్వంత్‌తో కలిసి బైక్‌పై జయశంకర్ భూపాలపల్లి జిల్లా గొర్లవీడులో జరిగే శుభకార్యంలో పాల్గొనేందుకు వెళ్తున్నారు. మార్గమధ్యలో భట్టుపల్లి బస్టాండ్ వద్ద ఆర్టీసీ బస్సు నిలిచి ఉండడంతో పక్కనుంచి వెళ్తున్నారు. ఈ క్రమంలో బస్సుడ్రైవర్ బైక్‌ను గమనించకుండా సైడ్‌నుంచి ఢీకొట్టడంతో బైక్‌పై నుంచి ముగ్గురు కిందపడ్డారు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న లారీ వేగంగా, అజాగ్రత్తగా వస్తూ మధూకర్, యశ్వంత్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి కాలు, తలకు గాయాలయ్యాయి. సౌజన్య తలకు బలమైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావమై స్పాట్‌లోనే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారన్నారు. గాయపడిన మధూకర్, యశ్వంత్‌ను మంథని సామాజిక వైద్యశాలలో ప్రథమ చికిత్స అందించి కరీంనగర్ తరలించారన్నారు. మృతురాలి తండ్రి నాంసాని అంజయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పార్టీని మరింత పటిష్ట పర్చాలి



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎర్రోళ్ల శ్రీనివాస్

సుల్తానాబాద్(పెద్దపల్లి): బీఆర్ఎస్ పార్టీని మరింత పటిష్టపర్చి రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి తీసుకవచ్చేందుకు కలిసికట్టుగా పని చేయాలని ఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జి ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పెద్దపల్లిలో ఏర్పాటు చేసిన పార్టీ జిల్లా సమావేశానికి వెళ్తూ సుల్తానాబాద్‌లో ఆగారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. నాయకులు శాలువాలు, పూలమాలలతో ఆయనను సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు బుర్ర శ్రీనివాస్‌గౌడ్, పురం ప్రేంచందర్ రావు, ముత్యం రమేష్‌గౌడ్, తిప్పారపు దయాకర్, పల్లా సురేష్, పకీర్ యాదవ్, కలీముద్దీన్ బోయిని రాజమల్లయ్య, కాదాసి చంద్రమౌళి, రాజమౌళి, రాజోజుల శివకుమార్, గడ్డం తిరుపతి గౌడ్, ప్రభాకర్ ,సంజీవ్ రాజేశ్వరరావు, కోటనితీష్ రెడ్డి, విక్కీ గౌడ్, గుండా అరుణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి బిజినెస్
శనివారం
18-3-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	355	57,990
నిఫ్టీ ▲	114	17,100

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	11,650	▽	66
డోజోన్స్	31,923	▽	323
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,335	▽	75
డాక్స్	14,768	▽	199
షాంఘై	3,251	▲	24
నికాయ్	27,334	▲	323

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై		
బంగారం (24 క్యారట్)	58,882 ▽	121
బంగారం (22 క్యారట్)	58,646 ▽	120
వెండి (కిలో)	71,576 ▽	523

బిస్లెరీతో చర్చలకు 'టాటా'

వ్యాపార విస్తరణపై దృష్టి కొనసాగింపు



న్యూఢిల్లీ: ప్యాకేజ్డ్ వాటర్ బిజినెస్ కొనుగోలుకి బిస్లెరీ ఇంటర్నేషనల్‌తో చేపట్టిన చర్చలకు చెక్ పడినట్లు ఎఫ్ఎంసీజీ దిగ్గజం టాటా కన్జూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్(టీసీపీఎల్) తాజాగా వెల్లడించింది. ఇటీవల కొద్ది రోజులుగా బిస్లెరీ బ్రాండును టాటా గ్రూప్ కొనుగోలు చేయనున్నట్లు అంచనాలు పెరిగిన నేపథ్యంలో చర్చలు నిలిపివేసినట్లు నియంత్రణ సంస్థలకు టాటా కన్జూమర్ తెలియజేసింది. ప్యాకేజ్డ్ వాటర్ బిజినెస్ కొనుగోలుకి బిస్లెరీ ఇంటర్నేషనల్‌తో ఎలాంటి తప్పనిసరి ఒప్పందాలు కుదుర్చుకోలేదని స్పష్టం చేసింది. ఇందుకు ఎలాంటి కట్టుబాట్లనూ ఏర్పాటు చేసుకోలేదని తెలియజేసింది. అయితే వ్యాపార విస్తరణ, వృద్ధి అవకాశాలకున్న వ్యూహాత్మక అంశాలపై దృష్టి కొనసాగిస్తున్నట్లు పేర్కొంది. ఇకపైనా బిస్లెరీ ఇంటర్నేషనల్ సహా వివిధ సంస్థలతో చర్చలు నిర్వహించే వీలున్నట్లు వెల్లడించింది. కాగా.. బిస్లెరీ ఇంటర్నేషనల్ విక్రయానికి టీసీపీఎల్‌తోపాటు పలు కొనుగోలుదారులతో చర్చలు నిర్వహిస్తున్నట్లు ప్రమోటర్, వెనుకటితరం పారిశ్రామికవేత్త రమేష్ చౌహాన్ గతేడాది పేర్కొన్నారు. మరోవైపు మరిన్ని మార్కెట్లలో విస్తరించేందుకు అనువుగా టీసీపీఎల్ పలు కంపెనీలను కొనుగోలు చేస్తూ వస్తోంది. టీసీపీఎల్‌కు ఇప్పటికే హిమాలయన్ బ్రాండుతో బాటిల్డ్ వాటర్ విభాగంలో కార్యకలాపాలు ఉన్నాయి.

తాజా వివరణ నేపథ్యంలో టీసీపీఎల్ షేరు 2 శాతం బలపడి రూ. 708 వద్ద ముగిసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
18-2-2023	
విశాఖ	450-00
చిత్తూరు	473-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	438-00
విజయవాడ	438-00
రిటైల్ ధర (డజను)	66.00
17-2-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	425-00
వరంగల్	427-00
రిటైల్ ధర	4.95

మా ఉత్పత్తులకు హబ్‌గా శ్రీసిటీ

- ఈసారి బిలియన్ డాలర్ల ఆదాయ లక్ష్యం
- బ్లూస్టార్ ఎండీ త్యాగరాజన్ వెల్లడి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రాబోయే రోజుల్లో తమ ఉత్పత్తులకు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీ హబ్‌గా మారగలదని ఎయిర్ కండీషనింగ్, రిఫ్రిజిరేషన్ ఉత్పత్తుల సంస్థ బ్లూస్టార్ ఎండీ బి. త్యాగరాజన్ చెప్పారు. ఇప్పటికే అక్కడ ఇన్వెస్ట్ చేసినవి, కొత్తగా చేయబోయేవి కలిపి రాబోయే మూడేళ్లలో మొత్తం రూ. 1,000 కోట్ల పైచిలుకు పెట్టుబడి పెట్టినట్లవుతుందని త్యాగరాజన్ వివరించారు. వ్యూహాత్మక స్థానంలో ఉన్నందున సరుకు రవాణా, నిల్వ చేసుకోవడం వంటి విషయాలకు సంబంధించి తమకు ఇది ప్రయోజనకరంగా ఉంటోందని పేర్కొన్నారు. శుక్రవారమిక్కడ కొత్త ఉత్పత్తులను ఆవిష్కరించిన సందర్భంగా త్యాగరాజన్ ఈ విషయాలు చెప్పారు. శ్రీసిటీలో రూమ్ ఏసీల తయారీకి సంబంధించి మొత్తం నాలుగు దశల్లో ప్రస్తుతం తొలి దశ పూర్తయి ఇటీవలే ఉత్పత్తి మొదలైందని చెప్పారు. మిగతావి కూడా పూర్తయితే 12 లక్షల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. అటు కమర్షియల్ ఏసీల తయారీకి సంబంధించి రెండో ప్లాంటు నిర్మాణం కోసం 40 ఎకరాలు సమీకరించినట్లు, 2024లో పనులు, 2025లో ఉత్పత్తి ప్రారంభం కాగలదని అంచనా వేస్తున్నట్లు త్యాగరాజన్ చెప్పారు. గత కొద్ది త్రైమాసికాలుగా సానుకూల ఫలితాలు నమోదు చేస్తున్న నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బిలియన్ డాలర్ల ఆదాయం (దాదాపు రూ. 8,200 కోట్లు) అంచనా వేస్తున్నట్లు ఆయన తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో సంస్థ రూ. 6,046 కోట్ల ఆదాయం నమోదు చేసింది.



బ్లూస్టార్ కొత్త ఉత్పత్తుల శ్రేణి ఆవిష్కరణ కార్యక్రమంలో సంస్థ వైస్ ప్రెసిడెంట్ ఎం శ్రీనివాస్ రెడ్డి (ఎడమ), ఎండీ బి. త్యాగరాజన్

అంతర్జాతీయంగా విస్తరణ..: కొత్త విభాగాల్లో ప్రవేశించడం కన్నా ఇతర దేశాల్లో మరింత విస్తరించడంపై దృష్టి పెడుతున్నట్లు త్యాగరాజన్ చెప్పారు. ప్రస్తుతం మధ్యప్రాచ్య దేశాలకు ఎగుమతి చేస్తుండగా అమెరికా, యూరప్ తదితర మార్కెట్లలోనూ కార్యకలాపాలకు సిద్ధమవుతున్నట్లు వివరించారు. ఆయా మార్కెట్లకు ఈ ఏడాది ఆఖరు నుంచే ఎగుమతులు మొదలుపెట్టే అవకాశం ఉందన్నారు.

కొత్త ఫ్రీజర్ల శ్రేణి..

బ్లూస్టార్ ఆవిష్కరించిన కొత్త ఉత్పత్తుల శ్రేణిలో దేశీయంగా తీర్చిదిద్దిన డీప్ ఫ్రీజర్లు, రిఫ్రిజిరేషన్ ఉత్పత్తులు ఉన్నాయి. వీటి కూలింగ్, నిల్వ సామర్థ్యాలు మరింత అధికంగా ఉంటాయని, వీటిని మహారాష్ట్రలోని వాడా ప్లాంటులో తయారు చేశామని త్యాగరాజన్ తెలిపారు. రాబోయే రోజుల్లో తమ సంస్థ వృద్ధికి కమర్షియల్ రిఫ్రిజిరేషన్ మరింతగా ఊతమివ్వగలదని పేర్కొన్నారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో ఈ విభాగం నుంచి తమకు రూ. 70 కోట్లు, దక్షిణాదిలో రూ. 235 కోట్ల పైచిలుకు ఆదాయం వస్తోందన్నారు. మొత్తం అన్ని విభాగాల రీత్యా చూస్తే తమ సంస్థ 20-25 శాతం వృద్ధి సాధిస్తోందని, పరిశ్రమ వృద్ధి సుమారు 15-20 శాతం మేర ఉంటోందని పేర్కొన్నారు.

హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం విలీనానికి ఓకే

ఎన్‌సీఎల్‌టీ అనుమతి

న్యూఢిల్లీ: ఫైనాన్షియల్ రంగ దిగ్గజాలు హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ విలీనానికి జాతీయ కంపెనీ చట్ట ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ) తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ప్రైవేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో దేశంలోనే అతిపెద్ద మార్ట్‌గేజ్ కంపెనీ హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్ విలీనంకానుంది. వెరసి దేశీ కార్పొరేట్ చరిత్రలోనే ఇది అతిపెద్ద విలీనంగా నమోదుకానుంది. ఇందుకు ఇప్పటికే నియంత్రణ సంస్థలు ఆర్‌బీఐ, సెబీ, పీఎఫ్‌ఆర్‌డీఏ, సీసీఐ అనుమతించాయి. స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజాలు బీఎస్ఈ, ఎన్ఎస్ఈ సైతం ఓకే చెప్పాయి. ఈ బాటలో రెండు సంస్థల వాటాదారుల నుంచి అనుమతి కోరేందుకు ఎన్‌సీఎల్‌టీ అనుమతించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం క్యూ3 నాటికి విలీనం పూర్తికావచ్చని అంచనా.

ట్యూబులర్ బిడ్‌కు గ్రీన్‌సిగ్నల్

రుణ సంక్షోభంలో చిక్కుకున్న సింటెక్స్ కొనుగోలుకి ప్రొపెల్ ప్లాస్టిక్ ప్రొడక్ట్స్, ప్లాస్టాటో (ట్యూబులర్ పైప్స్) కన్సార్షియం వేసిన బిడ్‌కు ఎన్‌సీఎల్‌టీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బిడ్ విలువ రూ. 1,250 కోట్లుగా సంబంధిత వర్గాలు తెలియజేశాయి.

సరికొత్త ఫీచర్లతో పల్సర్ ఎన్ఎస్ సిరీస్

హైదరాబాద్: బజాజ్ ఆటో తన పల్సర్ ఎన్ఎస్ నేకెడ్ స్ట్రీట్‌ఫైటర్ లైన్‌కు అప్‌డేట్ వెర్షన్‌ను విడుదల చేసింది. ఈ సిరీస్‌లోని ఎన్ఎస్ 160, ఎన్ఎస్ 200 మోడళ్లను సరికొత్త ఫీచర్లతో తీసుకొచ్చింది. వీటి ధరలు వరుసగా రూ.1.35 లక్షలు.., రూ.1.47 లక్షలుగా ఉన్నాయి. మంచి హ్యాండ్లింగ్ కోసం యూఎస్‌డీ ఫ్రంట్ ఫోర్క్‌లు, మెరుగైన భద్రతకు డ్యూయల్ చానల్ ఏబీఎస్‌ను అమర్చారు. ఇన్ఫినిటీ డిస్‌ప్లే కొత్త పల్సర్లలో ప్రత్యేకం. డిస్‌ప్లే కన్సోల్‌లో ఇప్పుడు గేర్ పొజిషన్ ఇండికేటర్ కూడా ఉంది. ఎన్ఎస్ 200 మోడల్ 18.75 ఎన్ఎమ్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. 6-స్పీడ్ మ్యాన్యువల్ గేర్‌బాక్స్‌తో జత చేశారు. ఎన్ఎస్ 160 మోడల్ 14.6 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇంజిన్ 5-స్పీడ్ గేర్‌బాక్స్‌తో వస్తుంది.



బిగ్'సి' ఉగాది ఆఫర్లు



హైదరాబాద్: మొబైల్స్ రిటైల్ విక్రయ సంస్థ 'బిగ్ సి' ఉగాది పండుగ సందర్భంగా వినూత్న ఆఫర్లు ప్రకటించింది. మొబైల్స్, స్మార్ట్ టీవీలు, ల్యాప్‌టాప్‌ల కొనుగోలుపై ఆకర్షణీయ రాయితీలు అందిస్తున్నట్లు కంపెనీ సీఎండీ యం.బాలు చౌదరి తెలిపారు. స్మార్ట్ ఫోన్ల కొనుగోలుపై పదిశాతం వరకు క్యాష్ బ్యాక్‌తో పాటు ఎలాంటి వడ్డీ, డౌన్ పేమెంట్ లేకుండా సులభ ఈఎంఐలలో పొందొచ్చన్నారు. స్మార్ట్ టీవీల కొనుగోలుపై 1,500 వరకు క్యాష్ బ్యాక్ ఇస్తుందన్నారు. సులభ ఈఎంఐ పద్ధతిలో ల్యాప్‌టాప్స్ కొనే సౌకర్యం కూడా ఉందన్నారు. ''ప్రతి కొనుగోలుపై కచ్చితమైన బహుమతి ఉంటుంది. మా రిటైల్ స్టోర్లలో ఆన్‌లైన్ కంటే తక్కువ ధరలకే ఉత్పత్తులు లభిస్తాయి. ప్రజలంతా ఈ ఆఫర్లను వినియోగించుకోవాలి'' అని బాలు చౌదరి కోరారు.

ఫోన్‌పే రూ. 1,650 కోట్ల సమీకరణ



న్యూఢిల్లీ: ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే కొత్తగా 200 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 1,650 కోట్లు) సమీకరించింది. 12 బిలియన్ డాలర్ల వేల్యుయేషన్‌తో ప్రధాన వాటాదారు వాల్‌మార్ట్ ఈ మేరకు నిధులు సమకూర్చింది. సింగపూర్ నుంచి భారత్‌కు కార్యాలయాన్ని మార్చుకున్న నేపథ్యంలో ఫోన్‌పే 1 బిలియన్ డాలర్ల వరకూ మూలధనాన్ని సేకరించే ప్రయత్నాల్లో ఉంది. తాజాగా అందిన నిధులతో ఇప్పటివరకూ 650 మిలియన్ డాలర్లు (దాదాపు రూ. 5,360 కోట్లు) సమీకరించినట్లవుతుంది. మిగతా పెట్టుబడులను కూడా త్వరలోనే ప్రకటించే అవకాశం ఉంది. ఈ నిధులను బీమా, వెల్త్ మేనేజ్‌మెంట్, రుణాలు, స్టాక్ బ్రోకింగ్ మొదలైన వ్యాపార విభాగాల వృద్ధికి ఉపయోగించుకోనుంది. గూగుల్ పే, పేటీఎంలతో ఫోన్‌పే పోటీపడుతోంది.

ఒడిదుడుకులున్నా... లాభాలే!

- 17,100 వద్ద నిఫ్టీ ముగింపు
- సెన్సెక్స్ లాభం 355 పాయింట్లు
- రెండో రోజూ ముందడుగు



ముంబై: ఒడిదుడుకుల ట్రేడింగ్‌లో స్టాక్ సూచీలు శుక్రవారం లాభాలు గడించాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో రికవరీ ఇన్వెస్టర్లకు ఉత్సాహాన్నిచ్చింది. క్రూడ్ ధరలు దిగిరావడం, రూపాయి బలపడటం కలిసొచ్చాయి. మెటల్, బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల షేర్లు రాణించాయి. ఉదయం సెన్సెక్స్ 403 పాయింట్లు బలపడి 58,038 వద్ద, నిఫ్టీ 126 పాయింట్లు పెరిగి 17,112 వద్ద మొదలయ్యాయి. భారీ లాభాల ప్రారంభం నేపథ్యంలో ఇన్వెస్టర్లు తొలి దశలో లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ఫలితంగా సూచీలు మిడ్‌సెషన్ కల్లా ఆరంభ లాభాలను కోల్పోయాయి. ఒక దశలో సెన్సెక్స్ 131 పాయింట్లు నష్టపోయి 57,504 వద్ద, నిఫ్టీ 28 పాయింట్లు పతనమై 16,958 వద్ద ఇంట్రాడే కనిష్టాలను నమోదు చేశాయి. ద్వితీయార్థంలో కనిష్ఠ స్థాయిల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించింది. చివరి వరకు అదే జోరు కొనసాగడంతో సెన్సెక్స్ 355 పాయింట్లు బలపడి 57,990 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 114 పాయింట్లు పెరిగి 17,100 వద్ద నిలిచింది. విస్తృత స్థాయి మార్కెట్లో కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు అర శాతం చొప్పున పెరిగాయి. ఆటో, ఎఫ్ఎంసీజీ, ఫార్మా, మీడియా షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఎఫ్‌పీఐలు రూ.1817 కోట్ల షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1767 కోట్ల షేర్లను కొన్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ 28 పైసలు క్షీణించి 82.65 స్థాయి వద్ద స్థిరపడింది. ఆసియా మార్కెట్లు 1% లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు 0.5% నష్టపోయాయి. యూఎస్ స్టాక్ సూచీలు ఒకశాతం నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- బ్లాక్ డీల్ ద్వారా భారీ సంఖ్యలో షేర్లు మారడంతో బయోకాన్ షేరు 9% నష్టపోయి రూ.202 వద్ద స్థిరపడింది.
- రియల్టీ రంగ సంస్థ డీఎల్‌ఎఫ్ షేరు నాలుగుశాతానికి పైగా లాభపడి రూ 375 వద్ద స్థిరపడింది. అతి తక్కువ సమయంలో రికార్డు స్థాయిలో రూ.8,000 కోట్ల విలువైన లగ్జరీ ఫ్లాట్లను విక్రయించడంతో ఈ షేరుకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ట్రేడింగ్‌లో ఐదు శాతం పెరిగి రూ.377.50 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.
- కేంద్రం రూ.70,500 కోట్ల రక్షణ ఉత్పత్తుల కొనుగోళ్లకు అనుమతినివ్వడంతో హిందూస్థాన్ ఏరోనాటిక్స్ షేరు మూడుశాతం లాభపడి రూ.2,780 వద్ద ముగిసింది.

సాక్షి స్పోర్ట్స్

ఉత్తమ ఆటగాళ్లుగా సవితా పూనియా, హార్దిక్ సింగ్

భారత హాకీ సమాఖ్య (హెచ్ఐ) 2022 సంవత్సరానికిగాను భారత జట్టుకు సంబంధించి వార్షిక అవార్డులను ప్రకటించింది. పురుషుల విభాగంలో మిడ్‌ఫీల్డర్ హార్దిక్ సింగ్, మహిళల విభాగంలో సవితా పూనియా హాకీ ఇండియా ఉత్తమ ఆటగాళ్లుగా నిలిచారు. ఒడిషాలో జరిగిన హాకీ ప్రపంచకప్‌లో హార్దిక్ అద్భుత ఆటతీరు కనబర్చాడు. ఎఫ్ఐహెచ్ ఉమెన్స్ నేషనల్ కప్ టైటిల్ గెలిపించి ప్రొ లీగ్‌కు భారత జట్టు అర్హత సాధించడంలో కీపర్‌గా, కెప్టెన్‌గా సవిత కీలక పాత్ర పోషించింది. ఇద్దరికీ హాకీ ఇండియా తరఫున రూ. 25 లక్షల చొప్పున నగదు పురస్కారం లభించింది. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వీటిని అందజేశారు. దీంతో పాటు 2021కు సంబంధించిన అవార్డులను కూడా ప్రకటించగా హర్మన్‌ప్రీత్, సవితా పూనియా అత్యుత్తమ ఆటగాళ్లుగా అవార్డులు అందుకున్నారు. 2022లో సుల్తాన్ జోహర్ కప్ గెలిచిన భారత జూనియర్ జట్టును కూడా ఈ సందర్భంగా సత్కరించారు.



రాహుల్, జడేజా గెలిపించగా...



రాహుల్

- తొలి వన్డే భారత్‌దే
- 5 వికెట్లతో ఓడిన ఆస్ట్రేలియా
- రాణించిన షమీ, సిరాజ్
- ఆదివారం విశాఖపట్నంలో రెండో వన్డే

తొలి వన్డేలో భారత్ విజయలక్ష్యం 189 పరుగులే...దీనిని చూస్తే ఛేదన చాలా సులువనిపించింది. కానీ ఒక దశలో స్కోరు 16/3 కాగా, ఆపై 39/4కు మారింది...ప్రతికూలంగా ఉన్న పిచ్‌పై భారత బ్యాటర్లు శ్రమించాల్సి వచ్చింది. చివరకు రాహుల్, జడేజా శతక భాగస్వామ్యం జట్టును విజయం దిశగా నడిపించింది. ఎనిమిది నెలల తర్వాత ఆడిన తొలి వన్డేలో జడేజా ఆల్‌రౌండ్ ప్రదర్శన నమోదు చేయగా, టెస్టుల్లో బ్యాటింగ్‌పై తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న రాహుల్ వన్డేల్లో తానేంటో చూపించాడు. అంతకు ముందు భారత బౌలర్లు ఆసీస్‌ను కట్టి పడేశారు. మిచెల్ మార్ష్ మెరుపు బ్యాటింగ్ ప్రదర్శన జట్టు భారీ స్కోరు చేసేందుకు సరిపోలేదు.

ముంబై: ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో భారత్ శుభారంభం చేసింది. శుక్రవారం జరిగిన తొలి వన్డేలో భారత్ 5 వికెట్ల తేడాతో ఆసీస్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 35.4 ఓవర్లలో 188 పరుగులకే కుప్పకూలింది. మిచెల్ మార్ష్ (65 బంతుల్లో 81; 10 ఫోర్లు, 5 సిక్సలు) మినహా అంతా విఫలమయ్యారు. అనంతరం భారత్ 39.5 ఓవర్లలో 5 వికెట్లకు 191 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ (91 బంతుల్లో 75 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్), రవీంద్ర జడేజా (69 బంతుల్లో 45 నాటౌట్; 5 ఫోర్లు) ఆరో వికెట్‌కు అభేద్యంగా 108 పరుగులు జత చేశారు. 2 వికెట్లు, 1 కీలక క్యాచ్‌తో పాటు బ్యాటింగ్‌లో రాణించిన జడేజా 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. సిరీస్‌లో భారత్ 1-0తో ఆధిక్యంలో నిలవగా... ఈ నెల 19న వైజాగ్‌లో రెండో వన్డే జరుగుతుంది.

మార్ష్ మినహా...

తన తొలి ఓవర్లోనే ట్రవిస్ హెడ్ (5)ను సిరాజ్ బౌల్డ్ చేయడంతో ఆస్ట్రేలియాకు సరైన ఆరంభం లభించలేదు. అయితే మార్ష్ దూకుడుగా ఆడి జట్టును నడిపించాడు. సిరాజ్ తర్వాతి ఓవర్లో మూడు ఫోర్లు కొట్టిన మార్ష్, సిరాజ్ మరో ఓవర్లోనే రెండు ఫోర్లు బాదాడు. 10 ఓవర్లు ముగిసే సరికి ఆసీస్ స్కోరు 59 పరుగులకు చేరింది. మార్ష్‌కు సహకరించిన స్టీవ్ స్మిత్ (22)ను కీపర్ రాహుల్ చక్కటి క్యాచ్‌తో వెనక్కి పంపడంతో 72 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెర పడింది. మార్ష్ 51 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కుల్దీప్ ఓవర్లో వరుసగా 4, 6 కొట్టి అతను తన జోరును కొనసాగించాడు. అయితే జడేజా బౌలింగ్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించిన మార్ష్ షార్ట్ థర్డ్‌మాన్ వద్ద సిరాజ్‌కు క్యాచ్ ఇచ్చాడు. మార్ష్, లబుషేన్ (15) మూడో వికెట్‌కు 52 పరుగులు జత చేశారు. అంతే...ఆ తర్వాత ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ ఒక్కసారిగా కుప్పకూలింది. 20వ ఓవర్లో 129/2తో మెరుగైన స్థితిలో నిలిచిన ఆ జట్టు 36వ ఓవర్ కూడా ముగియక ముందే ముగిసింది. 59 పరుగుల వ్యవధిలో ఆ జట్టు చివరి 8 వికెట్లు కోల్పోయింది. తన చివరి 14 బంతుల్లో షమీ ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా 3 వికెట్లు పడగొట్టగా...సిరాజ్ తన చివరి 10 బంతుల్లో ఒక్క పరుగూ ఇవ్వకుండా 2 వికెట్లు తీశాడు.



మార్ష్

శతక భాగస్వామ్యం...

స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే ప్రయత్నంలో ఆరంభంలో భారత్ తడబడింది. ఇషాన్ కిషన్ (3) తనకు లభించిన అరుదైన అవకాశాన్ని వృథా చేసుకోగా... స్టార్క్ వరుస బంతుల్లో కోహ్లి (4), సూర్యకుమార్ (0)లను ఎల్బీడబ్ల్యూగా అవుట్ చేసి భారత శిబిరంలో ఆందోళన పెంచాడు. వ్యక్తిగత స్కోర్ల 2, 7 వద్ద ఇన్‌గ్లిస్, స్మిత్ క్యాచ్‌లు వదిలేయడంతో బతికిపోయిన శుబ్‌మన్ గిల్ (20) దానిని ఉపయోగించుకోలేకపోయాడు. ఈ దశలో రాహుల్, హార్దిక్ పాండ్యా (25) కలిసి జట్టును ఆదుకున్నారు. అయితే స్టొయినిస్ బౌన్సర్‌తో పాండ్యాను అవుట్ చేయడంతో 44 పరుగుల ఐదో వికెట్ భాగస్వామ్యం ముగిసింది. విజయానికి మరో 106 పరుగులు చేయాల్సిన ఇలాంటి స్థితిలో ఆస్ట్రేలియాదే పైచేయిగా మారినట్లు అనిపించింది. కానీ రాహుల్, జడేజా జోడి ప్రత్యర్థికి మరో అవకాశం ఇవ్వలేదు. చక్కటి సమన్వయంతో బ్యాటింగ్ చేస్తూ వీరిద్దరు పరుగులు రాబట్టారు. ఈ క్రమంలో 73 బంతుల్లో రాహుల్ హాఫ్ సెంచరీ పూర్తయింది. ఈ జోడీని విడదీసేందుకు ఆసీస్ బౌలర్లు ఎన్ని ప్రయత్నాలు చేసినా లాభం లేకపోయింది.

స్కోరు వివరాలు:

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: హెడ్ (బి) సిరాజ్ 5; మార్ష్ (సి) సిరాజ్ (బి) జడేజా 81; స్మిత్ (సి) రాహుల్ (బి) పాండ్యా 22; లబుషేన్ (సి) జడేజా (బి) కుల్దీప్ 15; ఇన్‌గ్లిస్ (బి) షమీ 26; గ్రీన్ (బి) షమీ 12; మ్యాక్స్‌వెల్ (సి) పాండ్యా (బి) జడేజా 8; స్టొయినిస్ (సి) గిల్ (బి) షమీ 5; అబాట్ (సి) గిల్ (బి) సిరాజ్ 0; స్టార్క్ (నాటౌట్) 4; జంపా (సి) రాహుల్ (బి) సిరాజ్ 0; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (35.4 ఓవర్లలో ఆలౌట్) 188.**

వికెట్ల పతనం: 1-5, 2-77, 3-129, 4-139, 5-169, 6-174, 7-184, 8-184, 9-188, 10-188. **బౌలింగ్:** షమీ 6-2-17-3, సిరాజ్ 5.4-1-29-3, పాండ్యా 5-0-29-1, శార్దుల్ 2-0-12-0, జడేజా 9-0-46-2, కుల్దీప్ 8-1-48-1.

భారత్ ఇన్నింగ్స్: ఇషాన్ కిషన్ (ఎల్బీ) (బి) స్టొయినిస్ 3; గిల్ (సి) లబుషేన్ (బి) స్టార్క్ 20; కోహ్లి (ఎల్బీ) (బి) స్టార్క్ 4; సూర్యకుమార్ (ఎల్బీ) (బి) స్టార్క్ 0; రాహుల్ (నాటౌట్) 75; పాండ్యా (సి) గ్రీన్ (బి) స్టొయినిస్ 25; జడేజా (నాటౌట్) 45; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం (39.5 ఓవర్లలో 5 వికెట్లకు) 191.** **వికెట్ల పతనం:** 1-5, 2-16, 3-16, 4-39, 5-83. **బౌలింగ్:** స్టార్క్ 9.5-0- 49-3, స్టొయినిస్ 7-1-27-2, అబాట్ 9-0-31-0, గ్రీన్ 6-0-35-0, జంపా 6-0-37-0, మ్యాక్స్‌వెల్ 2-0-7-0.



జడేజా

గాయత్రి-ట్రెసా జోరు

- సెమీఫైనల్లో భారత జోడి
- ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్



బర్మింగ్‌హామ్: ప్రతిష్టాత్మక బీడబ్ల్యూఎఫ్ టూర్ సూపర్ 1000 టోర్నీ ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్‌లో పుల్లెల గాయత్రి గోపీచంద్ - ట్రెసా జాలీ దూకుడు కొనసాగుతోంది. మహిళల డబుల్స్‌లో గాయత్రి - ట్రెసా జంట వరుసగా రెండో ఏడాది ఈ టోర్నీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో భారత ద్వయం 21-14, 18-21, 21-12 స్కోరుతో లీ వెన్ మీ - ల్యూ వాన్ వాన్ (చైనా)పై విజయం సాధించింది. 64 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన ఈ పోరులో ప్రపంచ 17వ ర్యాంక్ జోడి గాయత్రి - ట్రెసా అటు అటాకింగ్, ఇటు డిఫెన్స్‌లో చెలరేగింది. గత ఏడాది కామన్వెల్త్ క్రీడల్లో కాంస్యం సాధించినప్పటినుంచి వరుస విజయాలతో సత్తా చాటుతున్న భారత జంట అదే జోరును ఇక్కడా ప్రదర్శించింది. తొలి గేమ్‌ను ధాటిగా ప్రారంభించిన గాయత్రి - ట్రెసా 6-2తో ఆధిక్యంలోకి దూసుకెళ్లారు. అయితే చైనా జంట 6-6తో స్కోరును సమం చేసింది. ఈ దశలో మళ్లీ చెలరేగిన భారత జోడి ముందుగా 11-8తో ఆధిక్యం ప్రదర్శించి ఆ తర్వాత వరుస పాయింట్లతో 18-12కు దూసుకెళ్లి ఆపై గేమ్‌ను సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లో మాత్రం భారత జంటకు గట్టి పోటీ ఎదురైంది. ఏ దశలోనూ ఆధిక్యం అందుకోలేకపోయిన గాయత్రి - ట్రెసా గేమ్‌ను కోల్పోయారు. చివరి గేమ్‌లో మాత్రం మన జట్టుదే హవా నడిచింది. వరుసగా ఆరు పాయింట్లతో 8-1తో ముందంజ వేసిన అనంతరం స్కోరు 11-4..13-5..15-8..18-10...ఇలా సాగింది. 20-12 వద్ద గాయత్రి కొట్టిన ఫోర్‌హ్యాండ్ స్మాష్‌తో భారత జంట విజయం ఖాయమైంది. సెమీ ఫైనల్లో కొరియాకు చెందిన బేక్ హ నా - లీ సో హీతో గాయత్రి - ట్రెసా తలపడతారు.

జాస్మిన్, శశి ముందంజ

వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్



న్యూఢిల్లీ: మహిళల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత ప్లేయర్లు జాస్మిన్ లంబోరియా, శశి చోప్రా రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు. శుక్రవారం జరిగిన తొలి పోరులో జాస్మిన్ (60 కేజీల విభాగం) రిఫరీ స్టాపింగ్ ద కాంటెస్ట్ (ఆర్ఎస్‌సీ) ద్వారా ఎన్‌యాంబెగా ఆంబ్రోస్ (టాంజానియా)ను చిత్తు చేసింది. బౌట్ మొదలైన 12 సెకన్లలోనే జాస్మిన్ విసిరిన పంచ్‌లకు ఆంబ్రోస్ తట్టుకోలేకపోవడంతో రిఫరీ ఆటను ఆపివేసి జాస్మిన్‌ను విజేతగా ప్రకటించారు. 63 కేజీల కేటగిరీలో శశి చోప్రా 5-0 స్కోరుతో ఎంవాంగి టెరిసియా (కెన్యా)పై ఘన విజయం సాధించింది. తర్వాతి రౌండ్‌లో సమడోవా (తజికిస్తాన్)తో జాస్మిన్... కిటో మై (జపాన్)తో శశి తలపడతారు. అయితే 70 కేజీల విభాగంలో భారత్‌కు నిరాశ ఎదురైంది. భారత బాక్సర్ శ్రుతి యాదవ్ 0-5తో జో పాన్ (చైనా) చేతిలో ఓటమిపాలైంది. నేడు భారత బాక్సర్లు నీతూ ఘంఘాస్, మంజు బంబోరియా తొలి రౌండ్‌లో ఆడతారు.

ఐర్లాండ్‌తో భారత్ టి20 సిరీస్

డబ్లిన్: ఈ ఏడాది ఆగస్టులో భారత్‌తో టి20 సిరీస్‌కు ఐర్లాండ్ బోర్డు ఆతిథ్యం ఇవ్వనుంది. ఆగస్టు 18 నుంచి 23 వరకు జరిగే ఈ సిరీస్‌లో ఇరు జట్ల మధ్య మూడు టి20 మ్యాచ్‌లు నిర్వహిస్తారు. అయితే మరి కొద్ది రోజుల తర్వాత స్వదేశంలో వన్డే వరల్డ్ కప్ ఉన్న నేపథ్యంలో భారత్ కోణంలో ఈ టి20 సిరీస్‌కు ప్రాధాన్యత లేదు కాబట్టి ద్వితీయ శ్రేణి జట్టు పాల్గొనే అవకాశం ఉంది.

న్యూజిలాండ్ 155/2

వెల్లింగ్టన్: శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 2 వికెట్లు కోల్పోయి 155 పరుగులు చేసింది. డెవాన్ కాన్వే (108 బంతుల్లో 78; 13 ఫోర్లు) అర్ధ సెంచరీ సాధించాడు. వర్షం, వెలుతురులేమి కారణంగా శుక్రవారం 48 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది.

'కెంట్' తరఫున అర్ష్‌దీప్ సింగ్

కెంట్: భారత లెఫ్టార్మ్ పేసర్ అర్ష్‌దీప్ దీప్ సింగ్ వచ్చే సీజన్‌లో ఐదు మ్యాచ్‌లలో 'కెంట్' కౌంటీకి ప్రాతినిధ్యం వహిస్తాడు. అర్ష్‌దీప్ భారత్ తరఫున 3 వన్డేలు, 26 టి20ల్లో ఆడాడు. భవిష్యత్తులో భారత టెస్టు జట్టులో అవకాశాల కోసం ఫస్ట్‌క్లాస్ క్రికెట్ ఆడమని, కౌంటీలు ఆడితే ప్రదర్శన మెరుగవుతుందని కోచ్ ద్రవిడ్ చేసిన సూచనతో అతను కౌంటీ క్రికెట్ వైపు వెళుతున్నాడు.